"కారులోనుంచి గొట్టాలు తియ్యరా" అని ప్రొడక్షన్ మేనేజరు కేక వేశాడు.

గొట్టాలు కారులోనుంచి తీసి, వాటిని నీళ్లతో నింపి హీరోయిన్‌కూ చెలికత్తెలకూ యిచ్చి, కెమేరాను, అమర్చేటప్పటికి, అయిదు గంటలయిందని స్టూడియో గంట మ్రోగింది.

"నేను వెళ్లాలి, పనుంది" అని కెమెరామన్ వెళ్లిపోయాడు.

"ఒక్కగంటవుండి పొమ్మనండీ" అని ప్రొడక్షను మేనేజరు డైరెక్టరువైపు చూసి అన్నాడు.

"వాళ్ల టైము అయిపోతే వాళ్లు వుంటారా? మనం ఇచ్చిన టైము కూడా ఎనిమిదినుంచి అయిదు గంటలదాకానే కదా!" అన్నాడు డైరెక్టరు.

బస్సుచార్జీలు దండుగ అయినాయనీ, ఒక రోజు వృథా అయిందనీ విచారిస్తూ నేనూ, నా స్నేహితుడూ ఇంటిదారి పట్టినాము.

———

# 14. సత్యాగ్రహం

పదిమందీచేరి, నాలుగురోడ్లూ కలిసేచోట మధ్యగా కట్టిన చౌతరా మీద కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"అదుగో నరసయ్య వస్తున్నాడు. ఏదో లేనిపోని గొడవ తెచ్చి పెట్టి పోట్లాటలోకి దింపుతాడు" అంటూ వెంకటరామయ్య లేచి వెళ్ళిపోయాడు.

"మొన్న సాయంత్రం- నీలాచలాన్ని చావగొట్టాడట గాదూ!" అన్నాడు వీరయ్య.

"చావగొట్టడమేమిటి, వాడింకా మంచం మీదనుంచి లేవలేదు. ఈ నరసయ్య వ్యవహారం రోజురోజుకి ముదిరిపోతోంది. వీణ్ణి ఎవళ్ళూ

యేమీ చెయ్యలేకుండా ఉన్నారు. వస్తున్నాడు; మనకెందుకులే" అని సర్దుకున్నాడు రామసుబ్బయ్య.

నరసయ్య వచ్చి చౌతారా యెక్కాడు. అజానుబాహు విగ్రహం, మెలిదిరిగిన కండలు, ఉంగరాలు తిప్పిన పెద్దమీసం, కోరచూపులు— అతణ్ణి చూస్తేనే కొద్దిగా భయం వేస్తుంది.

"ఏం, రామన్నా, ఏదో కబుర్లు చెప్పుకుంటున్నారే—"అన్నాడు నరసయ్య, చతికిలపడుతూ.

"ఏం లేదు, ఏదో ఊళ్లో మంచిసెబ్బర్లు. ఎక్కడికో పోయి వస్తున్నావల్లే ఉందే" అన్నాడు రామయ్య.

"ఎక్కడికి పోయినా! ఎక్కడికీ లే. మన వూరు కొత్తగా రాలే, ఇస్కూలు మేష్టరు! ఆయనేదో చెప్పితే విని వస్తున్నా. ఆయన తాడు లెగ, బాగా చెపుతాడయ్యా. శాంతమంట, సత్తెమంట- నాకు నచ్చిందిలే. ఇన్నాళ్ళు చేసిన యెదవ పన్లకి, నాకు నాకే తల్చుకు తల్చుకు ఏడుపొచ్చిందన్నా! ఇంక యేమయినా సరేగాని, నేను ఎవరిజోలికి పోదల్చుకోలే. ఏ యెదవన్నా- రామరామ- ఎవడన్నా నా జోలికి వాడంతట వాడు వచ్చినా, నేనుమట్టుకు వాడిపాపాన వాడేపోతాడులే అని వూరుకోవడమే. అట్లా మనమంతా చేస్తేనే మనకు సొరాజ్జం వస్తదంట-" అన్నాడు నరసయ్య.

"సారాయి దుకాణానికి వెళ్ళి వస్తున్నట్టున్నాడు" అని వీరయ్య చెవిలో రామసుబ్బయ్య అన్నాడు. వాళ్ళిద్దరూ ఒకొరొకరి చెవిలో చెప్పుకోవడం నరసయ్య విన్నాడు.

"మీకు నా మాటలు నమ్మకం లేనట్టుంది గామాలె. ఒక్కసారి ఆ యిస్కూలు మేష్టరు చెప్పింది యింటే మీకూ అట్టనే అనిపిస్తది" అన్నాడు నరసయ్య.

"అదిగాదయ్యా, మేం చెప్పుకొనేది. ఆ మేష్టరు గాంధీగారి మనిషిలే. గాంధీగారు యేం చెప్పారంటే, ఒక చెంపన యెవడైనా కొడితే, రెండో చెంప కూడా వాడికి చూపెట్టమన్నాడు. అట్టాంటి పనులు మనం చెయ్యగలమా అనుకుంటున్నాం మేము" అని జవాబు చెప్పాడు రామసుబ్బయ్య.

"ఎందుకు చెయ్యలేం! నన్ను ఒక చెంపన కొట్టే మగోడు ఎవ డైనా వుంటే రమ్మను, వాడికి రెండో చెంప కూడా యివ్వకపోతే, అప్పుడు నన్నడుగు" అన్నాడు నరసయ్య.

"ఈ వూళ్ళో నీ జోలికి వచ్చే మగాడు యెవడున్నాడు లెద్దూ" అని కొంచెం హుషార్ చేశాడు వీరయ్య.

"నేను మళ్లీ చెయ్యిజేసుకో నంటినిగా!" అని, యెవరైనా తనను కొట్టి చూడండి అన్నట్టు జాలిగా చూశాడు నరసయ్య.

ఇంతసేపూ మాట్లాడకుండా స్తంభానికి జేరబడికూచున్న ఆంజ నేయులు కొంచెం ముందుకు జరిగి "మళ్ళీ కొట్టనని నువ్వు ముందు అంటే మట్టుకు తీరా దెబ్బతిన్న తరవాత, నీ మనసు మారితే-" అని అడిగాడు.

"అట్టా మారే మనసు కాదయ్యా మనదీ. ప్రమాణం చేస్తాను కావాల్నంటే, రమ్మను మరి, ఎవరు వస్తారో ముందుకు" అని సవాలు చేశాడు నరసయ్య.

నరసయ్యను ఒక్క దెబ్బ ఎవరైనా కొడితే చూడాలని అందరికీ వుంది. కాని, ఆ పని చేసేవా రెవరు!

ఆంజనేయులు మాత్రం కొంచెం తెగించాడు.

"నేను కొడ్తాను. మరి మళ్ళీ కొట్టవు గదా!" అని, బెదరుతూ అడిగాడు.

"దేవుడితోడు, నీ జోలికి రాను. పైపెచ్చు, ఒక చెంప కొట్టిన వాడికి రెండో చెంప చూపిస్తానంటినిగా" అన్నాడు నరసయ్య.

ఆంజనేయులు తయారుగా లేచివచ్చాడు నరసయ్య తన కుడి చెంపను ఆంజనేయులు ఉపయోగార్థం తయారుచేసి పెట్టాడు.

ఆంజనేయులు అర్భకుడు కాదు. జెబ్బపుష్టి కలవాడు కూడాను. మంచి ఉత్సాహంతో, కుడిచేతిని బారెడు వెనక్కు లాగి, ముందుకు రివ్వుమనిపించి, ఛెళ్ళుమనే శబ్దంతో నరసయ్య దవడపైన పెట్టాడు. నరసయ్య దవడ వెంటనే కందింది. మనిషి కొంచెం వూగాడు. కళ్ళు ముందుగా అగ్నిలింగాలను క్రక్కాయి. కాని మెదడు కొంచెం పనిచేసి నట్టుంది; పెదవులు వికృతమైన చిరునవ్వు నవ్వాయి. "తమ్ముడూ,

యింద" అని ఎడమ దవడను ఆంజనేయులు వైపు తిప్పాడు. అక్కడున్నవారంతా ఆశ్చర్యపోయారు. ఆ కాంట్రాక్టు అంతవరకే; కాని, ఆనందోద్రేకంలో ఆంజనేయులికి వొళ్ళు తెలిసినట్టులేదు. ఫెడీల్మని నరసయ్య ఎడమ దవడను కూడా వాయించేశాడు.

నరసయ్యకు కళ్ళు గిర్రున తిరిగాయి. మరుక్షణంలో ఆంజనేయులు శవాన్ని, తామే అక్కడ పంచాయితీ చేయించవలసి ఉంటుందని అక్కడున్న వారంతా అనుకున్నారు కాని, అలా జరగలేదు. నరసయ్య తన కుడిచేతితో రెండు దవడలనూ సవరించుకుని, విజయ దృష్టితో నలుగుర్నీ చూశాడు. ఆంజనేయులు కూడా కొంచెం విజయ గర్వాన్ని ప్రదర్శించక పోలేదు.

ఆ చౌతరామీదినుంచి, ఆ పదిమందీ యిళ్ళకు చేరేలోపలనే ఈ వార్త వూరంతా పొక్కిపోయింది. తన ఉపన్యాసం ఫలించినందుకు, స్కూలు మేష్టరు పొంగిపోయాడు.

నరసయ్య యింటికి చేరేటప్పటికి, అతని భార్య దిగాలుపడి కూచుని ఉన్నది. ఆమె ధోరణిని నరసయ్య కనిపెట్టాడు.

"ఆ చౌతరాకాడికి యెందుకుపోయినావ్!" అని అడిగింది భార్య.

"పోవాల్సనేపోయినా. ఎన్నాళ్ళు చెడ్డపేరుతో బ్రతకడం? నా మనసు మారింది, నేను మంచి మార్గంలో పడ్డానని పదిమందికీ తెలియనిస్తే, సరిపోతదిగా" అని జవాబిచ్చాడు నరసయ్య.

"శానా బాగుంది. అందరూ నవ్వుతారు. ఇక రేపటినుంచి అందరూ నిన్ను యెకచెకాలు పట్టిస్తారు. మనసు మారితే, మార్చుకోవాల గాని, కనబడ్డ ప్రతీవాడికి నన్ను కొట్టు, నన్ను కొట్టు అని చెప్పుకోవాలా యేం?" అని అంటూ ఉండగా స్కూలు మేష్టరు వచ్చాడక్కడికి. వస్తూనే నరసయ్యను చాలా పొగిడాడు.

నరసయ్య ప్రవర్తన ఆ వూరికి కీర్తి తెచ్చిందన్నాడు. మొదట్లో ఒకవేళ, నరసయ్య ప్రతిభను యెవరైనా గ్రహించకపోయినా కొద్ది రోజులలోనే ఊరి వారంతా కూడా నరసయ్యకు బ్రహ్మరధం పట్టి వూరేగించక తప్పదన్నాడు. వెళ్ళిపోయాడు.

మర్నాడు ఉదయం తొమ్మిది గంటలకు నరసయ్య ఊళ్ళోకి

బయలుదేరాడు. ఇల్లు బయలుదేరి, పదిగజాలు వెళ్ళాడోలేదో, వెంకట రామయ్య యెదురుపడి "ఏమిటి, నిన్న నేదో—" అన్నాడు.

"ఏముంది? ఆంజనేయులు ఒక చెంపన కొట్టాడు, రెండో చెంప యిచ్చాను" అని సగర్వంగా చెప్పాడు నరసయ్య.

"ఆంజనేయులు ఒక్కడికే అలా చేస్తావా,ఎవరికైనా అంతేనా?" అని అడిగాడు వెంకటరామయ్య. అంజనేయులు గొప్ప ఏమిటీ?

"ఆంజనేయులును చూసి భయపడి నేనట్టా చెయ్యలేదు. వాడికి సత్యాగ్రహం నేర్పడానికి చేశాను" అన్నాడు నరసయ్య.

"అయితే, నేను కొట్టినా వూరుకుంటావా?" అన్నాడు వెంకట రామయ్య.

"ఊరుకో దలచుకున్నాక నువ్వేమిటి, ఇంకొకరేమిటి! చంటి పిల్లాడు కొట్టినా వూరుకుంటాను" అని నరసయ్య జవాబు చెప్పాడు.

"అయితే, చూదాం" అని వెంకటరామయ్య లాగి, నరసయ్య కుడిచెంపమీద కొట్టాడు.

నరసయ్య ఎడమ చెంపకూడా చూపించాడు. ఆ చెంపకూడా కందింది.

ఆ రోజున ఇలాగే, రామబ్రహ్మంచేత కూడా చెంప దెబ్బలు తిన్నాడు నరసయ్య.

ఆ మర్నాడు మరొకడు తగులుకుని దవడలు రెండూ వాయిం చాడు.

ఇల్లు వదిలి బైటికి వెడితే, పాత కావేషీలు జ్ఞాపకముంచుకొనో, లేక కాస్త వినోదంగా ఉంటుందనో ఎవడో ఒకడు కొంచెం జబ్బపుష్టి చూసుకుని, నరసయ్య రెండు దవడలూ వాయిస్తున్నాడు. దవడలు కంది, కంది, నొప్పి పుట్టి, చివరకు మొద్దుబారిపోతున్నాయి. కనపడ్డ ప్రతివాడిచేతా నరసయ్య తన్నులు తింటున్నాడనీ, తనను కొట్టినవాణ్ణి ఏమీ అనడం లేదనీ, పూరందరికీ తెలిసిపోయింది.

వారం రోజులు అయేటప్పటికి, ఇల్లు విడిచి బైటికి వెళ్ళడానికే నరసయ్యకు మనస్కరించకుండా పోయింది.

నరసయ్య భోజనానికి కూచున్నాడు. అంతా అయింది.

"మజ్జిగ" అన్నాడు.

"మజ్జిగ లేదు" అన్నది భార్య.

"ఏం?" అని, శాంతంగా అడిగాడు నరసయ్య.

"మన బఱ్ఱె ఋానకపాయె. ఇన్నాళ్ళు, నీకు జడిసి, కోమటి రంగయ్యగారి యింట్లో కాస్త చల్లపోసేవారు. ఇవ్వాళ నే వెడితే, మాకే చాలడం లేదన్నారు" అని జవాబు చెప్పింది భార్య.

నిట్టూర్చి, మజ్జిగలేకుండానే లేచి వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు నరసయ్య భార్య, పెరల్లో కూచుని చుట్టకాలుస్తూ దీర్ఘంగా ఆలోచిస్తూన్న నరసయ్యతో "కోమటాయన- ఉప్పు, బెల్లం, చింతపండు యివ్వండట. పాత బాకీయే శానా అయిందన్నాడు" అని చెప్పింది. సరే అని తల వూచాడు.

ఆ రాత్రి వొట్టి అన్నం, ఊరగాయతో తినవలసి వచ్చింది వాళ్ళిద్దరూ.

మర్నాడు తెల్లవారేసరికి ఊరంతా గుప్పుమన్నది. గడిచిన రాత్రి, నరసయ్య చొప్పవామికి ఎవరో నిప్పు పెట్టారు. ఆర్నెల్లు తన గేదెకోసం మేటి పెట్టుకున్న చొప్పంతా తగలబడిపోయింది.

నరసయ్య ఇంట్లో కూచుని సావధానంగా ఆలోచించాడు. జాము పొద్దెక్కేవేళకు చౌతరాకు వచ్చాడు. చాలమంది అక్కడ కూచుని కబుర్లు—నరసయ్య చొప్పవామి తగలబడటాన్ని గురించే—చెప్పు కుంటూ నవ్వుకుంటున్నారు. నరసయ్య చౌతారా యెక్కాడు.

"ఏం, నరసయ్యా, తగలబెట్టినవాడికి, రెండో వామి ఇవ్వవూ?" అన్నాడు ఆంజనేయులు.

ఆంజనేయులు మాట పూర్తికాకుండానే, నరసయ్య ఆంజనే యుల మీదికి లంఘించాడు. ఆంజనేయులు వుండచుట్టుకుని క్రిందపడి పోయాడు. నరసయ్య నిటాగ్గా నిలబడ్డాడు.

"నేను మనసు మార్చుకుంటే, ఊరు కూడా మనసు మార్చు కున్నట్టుంది. నా చొప్పవామిని యెవడో తగలబెట్టాడు. రేపు ఉదయా నికి, నా చొప్పవామి గడ్డి నాకు చేరకపోతే, వూళ్ళో ఎవడి చొప్పవామీ దక్కదు. నేను మళ్ళీ మామూలు మనిషినవుతున్నా. నన్ను యీ మధ్య

నలుగురైదుగురు కొట్టారు. వాళ్ళు నాకు బజార్లో కనబడకపోవడం వాళ్ళకీ నాకూ మంచిది" అని చెప్పి నరసయ్య వెళ్ళిపోయాడు.

ఒక గంట పోయేసరికి కోమటి రంగయ్య, నరసయ్య యింటికి వచ్చి, అతని భార్యతో ఆమెకు కావలసిన సామాను, కొట్టుకు వచ్చి తీసుకుపొమ్మని చెప్పాడు. మధ్యాహ్నం భోజనాల వేళకి, కోమటి రంగయ్య భార్య పెరుగు తీసుకు వచ్చి నరసయ్య భార్యకు యిచ్చి వెళ్ళింది.

మర్నాడు ఉదయానికి, నరసయ్య చొప్పదొడ్లో, రెండు వామ్ముల చొప్ప మేటికి పడివుంది.

నరసయ్య సత్యాగ్రహపు రోజులలో అతని దవడలు వాయగొట్టినవాళ్లు, నెల తిరక్కుండానే ఒక్కొక్కడు అధమం వారంరోజులైనా మంచమెక్కారు.

---

# 15. ఆ సమయం

ఆరు నెలల అబ్బాయిని తీసుకుని, పుట్టింటి నుంచి అత్తింటికి ప్రయాణం కడుతూ వుండగా కలరా తగిలి భర్త చనిపోయాడని మంగమ్మకి కబురు తెలిసింది. గోడుగోడున దుఃఖిస్తూ తన దురదృష్టాన్ని తిట్టుకుంది. ఆరునెలల పిల్లాడి అదృష్టము లేమికి విచారించింది.

అత్తారిల్లంటే మంగమ్మకి- అత్తా, మామా, ఆడుబిడ్డలూ ఎవరూ లేరు. ఇద్దరు మరదులున్నారు. వారిద్దరికీ భార్యలున్నారు. వాళ్ళలో ఎవరికీ పిల్లలు లేరు.

అన్నదమ్ములు ముగ్గురూ వుమ్మడిగానే ఉండి, పొలము పంటా చూసుకుంటూ ఉండేవారు. తమ్ముళ్ళు యిద్దరికీ అప్పుడప్పుడు ఏవైనా పోట్లాటలు వచ్చినా, పెద్దన్న సర్దివేస్తూ ఉండేవాడు. పెద్దన్న అంటే